
సాక్షి గుంటూరు

శనివారం । 2 । నవంబర్ । 2024



‘విజిలెన్స్’ వారోత్సవాలు

నగరంపాలెం: కలెక్టరేట్ ఆవరణలోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలు జరిగాయి. అధికారులు ప్రతిజ్ఞ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు విడుదలవుతోంది.



18,503 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 12,825 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 18,503 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా ఐక్యతా పరుగు



నగరంపాలెం: ఐకమత్యం పెంపొందించడమే జాతీయ ఐక్యతా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఐక్యతా పరుగును జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. మైదానం నుంచి కన్నవారితోటలోని వైఎస్సార్ విగ్రహం కూడలి వరకు వచ్చి, తిరిగి మైదానం వద్ద పరుగు ముగిసింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దృఢ సంకల్పం, పట్టుదల మనిషిని జీవితంలో మహోన్నత స్థానంలో నిలబెడతాయని అన్నారు. అందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ నిదర్శనమని చెప్పారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. తొలుత శాంతి కపోతాలను ఎగురవేశారు. అందరూ జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు మల్లికార్జునరావు, జయరాంప్రసాద్, శాంతకుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్వోగా ఖాజావలి బాధ్యతల స్వీకరణ




గుంటూరు వెస్ట్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్ఎస్‌కే ఖాజావలి శుక్రవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో మచిలీపట్నం, ఏలూరు ఆర్డీఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఆర్వోగా పనిచేసిన పెద్ది రోజా జీఏడీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఖాజావలి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా రంగాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, నాయకులు కరీముల్లా షాఖాదిరి, వై.నాగేశ్వరరావు, నీలిమ, రోజా, సిద్ధార్థ పుష్ప గుచ్ఛంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తమ న్యాయమైన కోర్కెల సాధనకు సహకారం అందించాలని విన్నవించారు.

అపార్ నమోదులో ఉపాధ్యాయులకు కష్టాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ నమోదులో ఉపాధ్యాయులు అనేక అవస్థలు పడుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా విద్యార్థుల పేర్ల నమోదులోనే ఉపాధ్యాయులు నిమగ్నం కావడంతో బోధన అటకెక్కిందని తెలిపారు. కొంత మంది పేర్లు ఎన్నిసార్లు ప్రయత్నించినప్పటికీ, నమోదు కావడం లేదని, కనీసం కారణం కూడా సాఫ్ట్‌వేర్ చూపకపోవడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారని అన్నారు. వివరాలు సరిగ్గా ఉన్నా అపార్ నమోదులో నిరాకరించడం వంటి అయోమయ పరిస్థితుల్లో ఉన్న ఉపాధ్యాయులకు పదే, పదే ఫోన్లు చేసి అధికారులకు మానసిక ఒత్తిడికి గురి చేయడం తగదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, నేతలు బురాన్, ఎం. నరసింహారావు, సీహెచ్ భుజంగరావు పాల్గొన్నారు.

రేపు దుర్గమ్మకు గాజుల అలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): యమ ద్వితీయ, భగిని హస్త భోజనాన్ని పురస్కరించుకుని 3వ తేదీన ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గాజులతో విశేషంగా అలంకరించనున్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారికి 2.50 లక్షల గాజులను అలంకరణ నిమిత్తం వినియోగిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ, ఖడ్గమాలార్చన తర్వాత అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

వంట నూనెలు సలసల..!

- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు
- రాయితీ పేరుతో అడ్డగోలు నిబంధనలు
- నామమాత్రంగా విక్రయ కేంద్రాలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- తనిఖీ ఊసెత్తని పలు శాఖల అధికారులు



వంట గదిలో మంట పెట్టకుండానే నూనెలు సలసలమంటున్నాయి. ధరలు రోజురోజుకూ భారీగా పెరుగుతుండటంతో సామాన్యులే కాదు.. మధ్యతరగతి వారు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చింది. వంటలో నూనె వాడకం తప్పనిసరికావడంతో ప్రజల జేబులు గుల్ల కాక తప్పడం లేదు. కృత్రిమ కొరత సృష్టిస్తూ కొందరు వ్యాపారులు ధరలను అమాంతం పెంచేసి, అందినకాడికి కొనుగోలుదారుల నుంచి లాగేస్తున్నారు.

నగరంపాలెం: ఇళ్ల వద్ద ఉండే చిల్లర దుకాణదారులు మొదలకుని మార్కెట్లో, షాపింగ్ మాల్స్‌లోనూ వంట నూనెలను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గత నెల్లో పామాయిల్ లీటర్ రూ.95 ఉండగా.. ఇప్పుడు రూ.130కు చేరింది. సన్‌ఫ్లవర్, బ్రాండెండ్ నూనె ప్యాకెట్ రూ.112 ఉండగా, ప్రస్తుతం రూ.145 వరకు విక్రయిస్తున్నారు. పదిహేను లీటర్ల నూనె క్యాన్లపై రూ.500 వరకు ధర పెంచారు.

పట్టించుకునే వారేరి?

వంట నూనెల ధరల నియంత్రణపై ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించడం లేదు. ఇటీవల ధరలు అమాంతం పెరగ్గా, రాయితీపై విక్రయించాలని నిర్ణయించారు. దీంతో పౌరసరఫరాల శాఖ నూనె ప్యాకెట్లను నిర్ణీత ధరలకు అందించాలని భావించింది. గత నెల చివర్లో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని రైతుబజార్‌లో, చుట్టుగుంట రైతుబజార్‌లో, పట్నంబజార్‌లోని 11 హోల్‌సేల్ దుకాణాల్లో రాయితీ విక్రయాలు ప్రారంభించారు. ఒక బియ్యం కార్డుదారునికి పామాయిల్ ప్యాకెట్ రూ.110 చొప్పున మూడు, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కి ఒక ప్యాకెట్ వంతున విక్రయించాలని నిర్ణయించారు. ఆయా కేంద్రాలలో ఒకట్రెండు రోజులు మినహా పెద్దగా విక్రయాలు లేవు. ఆర్టీసీ బస్టాండ్ రైతుబజార్ ఆవరణలో నూనె ప్యాకెట్లు లేవని, ఎప్పుడు వస్తాయనేది కూడా చెప్పలేమని కొనుగోలుదారులకు సమాధానం వస్తోంది. ఇక చుట్టుగుంట రైతు బజార్‌లో మరో విచిత్ర పరిస్థితి. ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నా.. నేరుగా విక్రయించడం లేదు. ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే, లింక్ వస్తుందని... ఆ లింక్‌లో రేషన్‌కార్డు నంబర్ నమోదు చేయాలని నిబంధనలు పెట్టారు. ఒకట్రెండు నూనె ప్యాకెట్లు కొనేందుకు వెళ్తే ఇన్ని నిబంధనలా అంటూ కొనుగోలుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓ మహిళ ఈ తతంగం పూర్తి చేయడం రాకపోవడంతో శుక్రవారం వెనుదిరిగి వెళ్లిపోయింది. ఇక పట్నంబజార్‌లో 11 విక్రయ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో కూడా ఎవరికీ తెలియవు. ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించేస్తున్నారు. నూనె ధరల కట్టడిలో పౌర సరఫరాలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర శాఖలు కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని ఏజెన్సీలు, హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్‌లు నల్లబజారుకు తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరు. జిల్లాలో తనిఖీలు నిర్వహించి దాఖలాలు కూడా లేవు. ఇటీవల పెరిగిన ధరల వల్ల మొక్కుబడిగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు. దీంతో ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు.





ఆర్టీసీ బస్టాండ్ రైతుబజార్‌లో కానరాని నూనె ప్యాకెట్‌లు

రెండు రోజుల క్రితమే రూ.5 పెంపు

నూనెల ధరలు భారీగా పెరిగాయి. దీంతో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. నూనె వాడకం తప్పనిసరి కావడంతో కొంటున్నాం. రెండు రోజుల క్రితం మరో రూ.5 పెంచారు.

– డి.రవణ, గుంటూరు నగరం

పక్కదోవ పట్టకుండా ఏర్పాట్లు

ఆర్టీసీ బస్టాండ్‌లో పూర్తిస్థాయిలో పామాయిల్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతాం. రేషన్ కార్డు తీసుకుని వెళ్తే దుకాణదారుడు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా నూనె ప్యాకెట్ అందిస్తారు. నూనె ప్యాకెట్లు పక్కదారి పట్టకుండా ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. ఇక పట్నం బజార్‌లోనూ నూనె ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి.

– పద్మ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

రెండేళ్ల క్రితం కట్టడి చేశారిలా..

ఇదే పరిస్థితి రెండేళ్ల క్రితం కూడా తలెత్తింది. దీంతో విజిలెన్స్, తూనికలు/కొలతలు, పౌర సరఫరాల శాఖల ఉద్యోగులు బృందాలుగా ఏర్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో వంట నూనెలను నిల్వలు చేసి విక్రయించే వ్యాపార సముదాయాలు, గోదాములు, కేంద్రాలపై దాడులు చేశారు. ప్రతి మండలం, పట్టణం, గ్రామాల్లో సోదాలు కొనసాగాయి. షాపింగ్ మాల్స్ నుంచి గల్లీలోని దుకాణాల్లోనూ తనిఖీలు సాగాయి. మొత్తం ఎనభై రోజుల్లో 700 చోట్ల ఈ తనిఖీలు చేపట్టారు. ధరలు సాధారణ స్థితికి చేరాయి. ప్రజలకు వంట నూనె అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో 2 ఏళ్ల క్రితం జిల్లాల్లో వంట నూనెల విక్రయ కేంద్రాలు నెలకొల్పారు. జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాల శాఖ) ఆదేశాల ప్రకారం ది గుంటూరు ఆయిల్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 – మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 –సాయంత్రం 6 గంటల వరకు విక్రయించారు. దీంతో ప్రజలకు మరింత ఊరట లభించింది. 2022 మార్చి– మే నెలల్లో కొద్ది రోజులు కలిపి 215 కేసులు, 6 (ఏ) నిత్యావసర వస్తువుల చట్టం కింద 9 కేసులు నమోదు చేశారు. సుమారు రూ.3.55 కోట్ల విలువ చేసే వివిధ రకాల వంట నూనెలు సీజ్ చేశారు.

విద్యార్థిని కుటుంబానికి నేడు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేత

పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కొద్ది కాలం క్రితం దళిత విద్యార్థిని హత్యకు గురైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూ.పది లక్షల ఆర్థికసాయాన్ని శనివారం పార్టీ నాయకులు అందజేయనున్నారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జులై 15వ తేదీన కొత్తరెడ్డిపాలెం దళితవాడ ప్రాంతానికి చెందిన విద్యార్థిని పేరుపోగు శైలజను సమీపంలో ఉండే గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు ఇంత వరకు అరెస్ట్ చేయలేకపోయారు. శైలజ కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు శనివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల రెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలు చెక్కు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు పాల్గొననున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు.

4న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎస్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ మేళా ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత నేరుగా తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు 91602 00652, ఎ.రమ్య 77029 21219 ఫోను నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంబటి రాంబాబు, బాల వజ్రబాబు, నియోజకవర్గాల సమన్వయకర్తలు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- ఘనంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలని సూచించారు. ఆయన సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలని వక్తలు అన్నారు. పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించినలో వారిలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), నియోజకవర్గాల సమన్వయ కర్తలు షేక్.నూరిఫాతిమా (గుంటూరు తూర్పు), అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి), మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నాయకులు మేకతోటి దయాసాగర్, చిన్నప్పరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు సి.డి.భగవాన్, అంగడి శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

చుక్కలు చూపిన పింఛన్ల పంపిణీ

- మొరాయించిన సర్వర్లతో ఉద్యోగులకు కష్టాలు
- ఇటు లబ్ధిదారులకూ తప్పని అవస్థలు
- అంగన్‌వాడీ కార్యకర్తకు చార్జ్ మెమో జారీ



నెహ్రూనగర్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం సచివాలయ సెక్రటరీలకు, ఉద్యోగులకు చుక్కలు చూపించింది. ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు సక్రమంగానే పనిచేసిన సర్వర్ ఆ తరువాత నుంచి పూర్తిగా స్తంభించింది. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు అందుబాటులోకి వచ్చింది. అప్పటి వరకు ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లోని పింఛను లబ్ధిదారుల చుట్టూ తిరిగారు. సర్వర్ ఎప్పుడు వస్తుందో... పింఛన్ల పంపిణీ ఎప్పటికి పూర్తి చేయాలో అంటూ సర్వర్ వైపు చూసుకుంటూ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల బాధలు ఇలా ఉంటే.. మరో పక్క అధికారులు మాత్రం ఒక్క రోజులోనే వంద శాతం పంపిణీ చేయాలని వారిపై ఒత్తిళ్లు తీసుకొచ్చారు. విషయం తెలిసినప్పటికీ అధికారులు మాత్రం టార్గెట్ పెట్టడం ఎంత వరకు సమంజసం అని కొంత మంది ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 2,58,258 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.108.72 కోట్లు విడుదల చేసింది. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 2,40,943 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి శనివారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు చార్జ్ మెమో

తాడికొండ నియోజకవర్గం లాం గ్రామంలో పింఛన్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయకుండా గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు పిలిచి ఇస్తున్నారనే ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి స్పందించారు. అంగన్‌వాడీ కార్యకర్త సామ్రాజ్యంకు చార్జ్ మెమో జారీ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

వైఎస్ జగన్ అడుగు జాడల్లో...

- ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాటం
- వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షుడు బాల వజ్రబాబు
- నేడు పదవీ ప్రమాణ స్వీకారం

నగరంపాలెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు జాడల్లో ముందుకెళ్తామని, ప్రజా సమస్యలపై పార్టీ పక్షాన కూటమిపై ఐకమత్యంగా పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా, ఐదు జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరించిన తాను కార్పొరేటర్‌గా గెలిచి ప్రస్తుతం జీఎంసీ ఉప మేయర్‌గా కొనసాగుతున్నానని గుర్తుచేశారు. పార్టీ నగర అధ్యక్షుడిగా ఈ నెల 2వ తేదీన గుంటూరు మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. నగర అధ్యక్ష పదవితోపాటు అనేక పదవుల్లో మాజీ సీఎం వైఎస్ జగన్ తనకు అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. పదవీ స్వీకార సభకు టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ డివిజన్లలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలో మరింత ఉత్తేజాన్ని నింపుతామని అన్నారు. పొన్నూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, అందర్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు.

జాతీయ స్థాయిలో జీఎంసీని తీర్చిదిద్దుతా

- డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి
- గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ

గుంటూరు మెడికల్: దేశంలోని టాప్–100 జాబితాలో గుంటూరు వైద్య కళాశాల చేరేలా తన వంతు కృషి చేస్తానని నూతన ప్రిన్సిపల్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఘన చరిత్ర కలిగిన కళాశాలకు ప్రిన్సిపల్‌గా తనకు అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య కళాశాలలో 1981లో పల్నాడు జిల్లా ఓబులేసునిపల్లి గ్రామం నుంచి ఎంబీబీఎస్‌లో చేరేందుకు వచ్చానని పేర్కొన్నారు. గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా, న్యూరాలజీ వైద్య విభాగాధిపతిగా పనిచేసి అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొంది పది నెలల క్రితం మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా బదిలీ అయినట్లు చెప్పారు. దాతల సహాయంతో సుమారు రూ.20 లక్షల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. అదే తరహాలో ఈ వైద్య కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారిని గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ నేతలు కలిసి అభినందించారు.

7న ఆచార్య ఎన్జీ రంగా జయంతి



పొన్నూరు: లాం లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలోని కృష్ణా ఆడిటోరియంలో ఈ నెల 7వ తేదీన రంగా ట్రస్టు ఆధ్వర్యంలో సమరయోధుడు ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్టు కమిటీ సభ్యుడు రామినేని కిషోర్ బాబు శుక్రవారం నిడుబ్రోలులోని ట్రస్టు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో ఆకుల జానకిబాబు, నన్నపనేని ప్రభాకరరావు, గోగినేని వెంకటేశ్వరరావు, వెలగా సుబ్బారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నుంచి వసూళ్లు

- స్టేక్ హోల్డర్ల సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఆరోపణలు
- నగరంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు
- సమావేశంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్. పక్కన మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు



హాజరైన ఎంఎల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, స్టేక్ హోల్డర్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారని స్టేక్ హోల్డర్స్ సమావేశంలో పలువురు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుంటూరు నగర సమగ్రాభివృద్ధిపై, స్వచ్ఛ గుంటూరు సాధనలో అధికారులు, ప్రజల భాగస్వామ్యంపై శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో స్టేక్ హోల్డర్ల సమావేశం జరిగింది. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎంఎల్సీలు కేఎస్ లక్ష్మణరావు, సీహెచ్ ఏసురత్నం, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లతోపాటు నగర కమిషనర్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...

సుమారు 11.50 లక్షల నగర జనాభాకి తగిన తాగునీటిని అందించలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉందన్నారు. త్వరలో ఏఐబీ, అమృత్ ప్రాజెక్ట్‌లో ఫేజ్ 1, 2, డిసెంబర్ నాటికి గోరంట్ల కొండ మీద ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని చెప్పారు. నగరంలోని 2.50 లక్షల ఇళ్లను 786 మైక్రో ప్యాకెట్స్‌గా విభజించి ఒక్కో ప్యాకెట్‌కి ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను నియమించామని తెలిపారు. చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రత బాధ్యత వీరిదే అన్నారు. వెహికిల్ షెడ్‌లో ప్రతి వాహనం రన్నింగ్‌లో ఉండేలా చూస్తామని తెలిపారు. నగరంలోని 3 నియోజకవర్గాలలో కమర్షియల్ వ్యర్థాల సేకరణ టెండర్లు పిలుస్తామని, ప్రత్యేక యాప్ తెస్తామని వివరించారు. శనివారం నుంచి అమరావతి రోడ్‌లో రహదారి పక్కన, డ్రైనేజీపైన ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. ఎంఎల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. నగరానికి సరిపడా తాగునీరు ఉన్నా సరఫరా వ్యవస్థ సరిగా లేదన్నారు. తాగునీరు, డ్రైనేజీ లైన్లు ఒకే చోట ఉంటే పరిశీలించి తగిన మార్పులు చేయాలన్నారు. రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని కోరారు. ఎంఎల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ.. కృష్ణా నది నుంచి నీటిని నల్లపాడులోని 110 ఎకరాల చెరువుకు పంపింగ్ చేస్తే గ్రావిటీ ద్వారా నగరానికి అందించవచ్చని సూచించారు. దీనికి దాదాపు రూ.150 కోట్లు ఖర్చు అవ్వొచ్చన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. శివారు ప్రాంతాలు, ముఖ్యంగా ప్రగతి నగర్‌కు తాగునీరు అందడం లేదన్నారు. వాటర్ మేనేజ్మెంట్ బోర్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాలు లేని ప్రాంతాల్లో పన్ను విధించి, ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టీడీపీ ఫ్లోర్ లీడర్ కె.రవీంద్ర, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, స్టేక్ హోల్డర్లు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,500

ప్రిన్సిపల్‌గా ఆచార్య సురేష్ బాధ్యతల స్వీకరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ఇంగ్లిష్ విభాగం ఆచార్యులు, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఆయన పదోన్నతి పొందారు. మాజీ ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య కె .గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.

హోటల్‌లో బ్లేడ్ బ్యాచ్ హల్‌చల్

- ఫ్రైడ్ రైస్ ధరపై వివాదం
- యజమానిపై అడ్డగోలుగా దాడి
- అడ్డొచ్చిన మహిళపైనా పిడిగుద్దులు
- బ్లేడుతో స్థానికులకు బెదిరింపులు



గాయపడిన హోటల్ యజమాని రాజు



హోటల్‌లో పనిచేసే మహిళపై దాడి చేస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో ఓ చిరు వ్యాపారిపై, ఆయన సహాయకురాలిపై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసింది. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. బాధితుడైన రాజు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఒక మహిళ వచ్చి ఫ్రైడ్‌రైస్ అడిగింది. ఆమె తరువాత మరో మహిళ వచ్చింది. ప్లేటు ఫ్రైడ్ రైస్ రూ.80 అని చెప్పగా.. మంగళగిరిలో రూ.50కి ఇస్తున్నారు, నువ్వేంటి ఎక్కువ చెబుతున్నావని ప్రశ్నించింది. అంత తక్కువకు ఇస్తే తాను కూడా వస్తానని, తనకూ ఇప్పించాలని రాజు అన్నారు. దీంతో ఆ ఇద్దరు మహిళలు ఒక్కసారిగా ఆయనపై దాడి చేశారు. అనంతరం 9.30 సమయంలో మరో 15 మంది వచ్చి హోటల్‌లో సామాన్లు బయటకు విసిరివేశారు. రాజు తల పగలకొట్టారు. హోటల్‌లో పనిచేస్తున్న మహిళను కూడా రోడ్డుపైకి లాక్కెళ్లి పిడిగుద్దులు కురిపిస్తూ దాడి చేశారు. వస్త్రాలు కూడా చించివేశారు. వారిని కొందరు స్థానికులు అడ్డుకోబోగా బ్లేడులు చూపించడంతో భయంతో పరుగులు తీశారు. మరోసారి రాజుపై దాడి చేయడంతో హోటల్ వదిలి పారిపోయారు. అమరావతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమందితో కూడిన బ్లేడ్ బ్యాచ్‌ను అమరావతి నుంచి బహిష్కరించగా... వారు ఉండవల్లి సెంటర్ శ్మశాన వాటిక వద్ద తలదాచుకున్నారని, వీరు ప్రతి గొడవలోనూ ఇలాగే దాడికి పాల్పడి కౌంటర్లలో ఉన్న డబ్బులు లాక్కెళతారని విశ్వసనీయ సమాచారం. జరిగిన ఘటనపై సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ... హోటల్‌పై దాడి చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఆ దాడిలో పాల్గొన్నవారు బ్లేడ్ బ్యాచ్ వారా? కాదా? అని విచారణ చేపట్టామని తెలిపారు. బ్లేడుతో కోస్తున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఆయన అన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణిని సత్కరిస్తున్న రూతు రమ్య తదితరులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణి విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించాలని, వారు కూడా అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం గలవారని పేర్కొన్నారు. పురుషులతోపాటు వారికి కూడా సమానావకాశాలు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ రూతు రమ్య, కార్యక్రమ కో ఆర్డినేటర్ ఎ. విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్



పత్తి సాగును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ: సీసీఐ నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో రైతు పోలు నాగేశ్వరరావుకు చెందిన పత్తి పంటను సంఘం నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఏడాది తాడికొండ, తుళ్ళూరు పరిసరాలలో రైతులు అధిక మొత్తంలో పత్తి సాగు చేస్తున్నారని చెప్పారు. ఇటీవల వర్షాల నేపథ్యంలో పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. ఎకరాకు 15 క్వింటాలు దిగుబడికి బదులు 3 క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు, పెట్టుబడులు సైతం నష్టపోయేలా ఉన్నారని తెలిపారు. సీసీఐ ద్వారా పత్తిని రూ.5 వేలకు అటు ఇటూ కొనుగోలు చేయడం తగదన్నారు. క్వింటా రూ.7,521 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. పత్తి రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలకు పంట నష్టం జరిగితే అంచనా సక్రమంగా వేయలేదని ఆరోపించారు. పంట బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాల రైతు సంఘం గౌరవాధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, చింతల భాస్కరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, రైతులు రామినేని రామారావు, శంకరరావులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై ఇంత నిర్లక్ష్యమా?

హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్



సమావేశంలో డేనియల్, శ్రీధర్

తెనాలి: విజయవాడలో నిర్మించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఇది ఆ మహానుభావుడిని అవమానించడమేనని హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్ అన్నారు. స్థానిక అయితానగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మృతివనం లోపలిభాగంలో ఉన్న ఏసీలు ఇటీవల పనిచేయటం లేదన్నారు. కరెంటు చార్జీలు భారంగా మారాయని అధికారులు అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఎల్ఈడీ స్క్రీన్స్‌పై విజ్ఞానదాయకమైన క్విజ్ ప్రోగ్రాంలు వచ్చేవని, ప్రస్తుతం ఆపేశారని తెలిపారు. ఎవరి ప్రమేయంతో ఇలా నిలుపుదల చేశారని ప్రశ్నించారు. ఆడిటోరియం నిర్మించారని, ఫుడ్‌కోర్టులు రెండు నిర్మాణంలో ఉండేవని చెబుతూ... ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటని అడిగారు. విజయవాడ మున్సిపల్ కమిషనర్‌కు దీనిపై లేఖ రాసి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరుకు, రాష్ట్రప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి ప్రతులు పంపినట్టు తెలిపారు. తగిన స్పందన వస్తుందని భావిస్తున్నానని అన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, హైకోర్టు న్యాయవాది దాసరి శ్రీధర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్మృతివనంలో ఏసీ, ఎల్ఈడీ స్క్రీన్స్ ప్రదర్శనల వంటివి వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ సదస్సుకు ఏఎన్‌యూ ఆచార్యులు

ఏఎన్‌యూ: ఈ నెల 8, 9 తేదీలలో థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో 'పరిశోధన , ఆవిష్కరణల'పై జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె మధుబాబు, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య బి. నాగరాజులు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి ఆహ్వాన పత్రిక అందినట్లు వారు తెలిపారు. సదస్సులో 'స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా'పై ఆచార్య మధుబాబు, 'ఎక్స్‌ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కేస్ స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే' పై ఆచార్య నాగరాజు పరిశోధన పత్రం సమర్పించేందుకు అనుమతి లభించింది. వీరిని వర్సిటీ ఉన్నతాధికారులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

బోరుపాలెంలో ఇసుక పంచాయితీ

తాడికొండ: తుళ్ళూరు మండలం బోరుపాలెం గ్రామంలో ఇసుక పంచాయితీ రవాణాకు ఆటంకంగా మారింది. స్థానికులకే అవకాశం ఇవ్వాలని, ఇతరులు రావడానికి వీల్లేదంటూ గ్రామంలోని వారు డిమాండ్ చేశారు. పక్క గ్రామాల నుంచి పని చేసుకునేందుకు వచ్చిన కూలీలతో వారికి గొడవ మొదలైంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. రీచ్‌ను మూసివేయించారు. రాత్రి సమయంలో యథేచ్ఛగా లోడింగ్ చేసి స్థానిక ట్రాక్టర్లలో నింపి తరలిస్తుండటం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 - సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంది. ఇక్కడ అనధికారికంగా స్థానికత పేరుతో టీడీపీ నాయకులు అక్రమ రవాణా చేస్తుండటం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడులో 54.8 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం పడింది. అత్యల్పంగా పెదకాకాని మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటు 10.3 మి.మీ.గా నమోదైంది. మండలాలవారీగా తుళ్ళూరులో 42, గుంటూరు పశ్చిమ 24.2, తాడేపల్లి 19.6, గుంటూరు తూర్పు 12.4, మంగళగిరి 10.8, మేడికొండూరు 8.4, తాడికొండ 7.2, కాకుమాను మండలంలో 4.2 మి.మీ. చొప్పున పడింది.

కామాంధుడిగా మారిన చిన్నాన్న

గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక

పెదకాకాని: తండ్రిలా కాపాడాల్సిన బాబాయి కామాంధుడిలా మారడంతో 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. ఈ సంఘటన పెదకాకాని మండలంలో వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త మరణించారు. అప్పటికే వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు బాలురు, ఓ బాలికను పోషించుకుంటూ ఆమె జీవనం సాగిస్తోంది. బాలిక ఐదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అదే ప్రదేశంలో ఉంటున్న చిన్నాన్న తాపీ పనులు చేస్తుంటాడు. అతడి కన్ను స్వయానా అన్న కుమార్తెపై పడింది. మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఎనిమిది నెలలుగా ఆ బాలికపై దారుణానికి ఒడిగడుతున్నాడు. ప్రస్తుతం బాలికకు నెలసరి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి స్థానిక డాక్టర్‌కు చూపించారు. బాలిక మూడు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్యుడు నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గురువారం నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోందని పెదకాకాని పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పట్టాల పక్కన మృతదేహంలో భాగం

పెదకాకాని: వేగంగా వస్తున్న రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గడ్డిపాడు సమీపంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని గడ్డిపాడు సమీపంలో ఉన్న ఇన్నర్‌రింగ్ రోడ్డు రైల్వేగేటు సమీపంలో శుక్రవారం ఉదయం 11:30 గంటలకు కోలకత్తా నుంచి పుట్టపర్తి రైలు వేగంగా వెళుతోంది. అప్పటి వరకూ అక్కడే ఉన్న మాచర్ల శ్రీహరిబాబు ఒక్కసారిగా పరిగెత్తుకుంటూ వెళ్లి రైలు కింద పడ్డాడు. క్షణాల్లోనే ఆయన శరీరం ఛిద్రమైంది. మృతదేహం భాగాలుగా విడిపోయింది. పర్సులో ఉన్న ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా తారకరామనగర్‌కు చెందిన మాచర్ల శ్రీహరిబాబు(35) ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. గుంటూరు రైల్వే పోలీసులు వచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మాహుతియత్నం

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతియత్నం చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని బాలాజీరావుపేటకు చెందిన అఫ్సానా, రమేష్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. రమేష్ కార్పెంటర్. అఫ్సానా బిర్యానీ పాయింట్‌లో పనిచేస్తోంది. భర్త నిత్యం అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్నాడు. భరించలేక వారం రోజుల క్రితం ఆమె పుట్టింటికి వచ్చింది. భర్త పట్టించుకోకపోవడం, తండ్రి మంచానికే పరిమితమై ఉండడంతో తాను తల్లికి భారం అవుతానని అఫ్సానా భావించింది. గురువారం మార్కెట్ ఏరియాలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మాహుతియత్నం చేసింది. స్థానికులు మంటలను ఆర్పి తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.